క్లుప్తంగా

విద్యార్థుల స్థాయిని పెంచాలి

చింతలమానెపల్లి: కనీస భాషా గణిత సామర్థ్యాల సాధన ద్వారా విద్యార్థుల స్థాయిని పెంచాలని డీఆర్పీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 5రోజుల శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనా అభ్యసన సామగ్రి వినియోగించి సులువుగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఎంఈవో జయరాజ్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థికి అందించి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా శిక్షణ పొందుతున్న ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీకాంత్ సూచించారు. ఐదు రోజుల శిక్షణలో భాగంగా తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎంఈవో శ్రీకాంత్ పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులతో మాట్లాడి పలు రకాల సూచనలు చేశారు. ఎంఆర్పీలు గంభీర్, శ్రీనివాస్, పొచ్చన్న, సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

ఆవులను వధించకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న నారాయణ

తలమడుగు: బక్రీద్ రోజు ఆవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండుగ రోజున ఆవులను వధించకుండా చూడాలన్నారు. గోవులను సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాదాజీ కిరణ్, పురుషోత్తం ఉన్నారు.

డీఐఈవోకు వినతి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం డీఐఈవో జాదవ్ గణేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ న్యాయబద్ధంగా రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌లో జాప్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇంక్రిమెంట్ విడుదల చేశారని, జిల్లాలో దాదాపు 120 మంది లెక్చరర్లు లబ్ధి పొందనున్నారన్నారు. సంఘం నాయకులు రమాదేవి, ప్రభావతి, శ్రీనివాస్, మహేశ్, ప్రవీణ్, రవికాంత్, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

'హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి'

బోథ్: అకాల వర్షాల వల్ల వ్యవసాయ మార్కెట్ యార్డులలో కష్టాల పాలవుతున్న రైతులకు తెలంగాణ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల బడ్జెట్‌ను అప్పటి మంత్రి హరీశ్‌రావు తన నియోజకవర్గం అభివృద్ధికి మళ్లించాడన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో శిక్షణకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 2025–26 సెషన్ సీఏటీఎస్ శిక్షణ పొందడానికి ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ, డిప్లొమో, ఎన్‌టీసీలో ఏదైనా ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 16 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల వసతి గృహంలో నిర్వహిస్తున్న మావల కేజీబీవీలో 6, 7, 8వ తరగతులకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేక అధికారి ఎస్. సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో తరగతులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 83099 56612పై సంప్రదించాలని కోరారు.

కబ్జా కోరల్లో శిఖం భూములు

- విలువైన ప్రభుత్వ భూములు మాయం
- మొద్దు నిద్రలో రెవెన్యూ యంత్రాంగం



కబ్జాకు గురైన గొల్లబాయ్ చెరువు భూమి

బెజ్జూర్: చెరువుల చుట్టూ విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నాయి. మండల కేంద్ర సమీపంలోని గొల్లబాయ్, నాగులమ్మ, ఇప్ప చెరువు, మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. శిఖం భూముల్లో అక్రమార్కులు సాగు చేస్తున్నారు. ఓ వైపు విలువైన ప్ర భుత్వ భూములు మాయమవుతుండగా, మరో వై పు రెవెన్యూ అధికారులు మొద్దునిద్ర వీడడం లేదు.

భూములు అన్యాక్రాంతం..

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. విలువైన భూములను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన సంబంధిత శాఖ అధికారులు ×మామూలు×గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు ఈతంతు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాల గురించి తెలిసినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం వెనుక అంతర్యం ఏంటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కబ్జా భూముల్లో అక్రమ నిర్మాణాలు

బెజ్జూర్‌లో కొందరు అక్రమార్కులు కబ్జాచేసిన ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. బస్టాండ్ కోసం 40 సెంట్లు మంగలిషాపుల కోసం 10 సెంట్లు, అంగడి బజార్‌కు 30 సెట్లు, కిరాణా షాపులకు 10 సెంట్లు, అటవీ శాఖ భవనానికి 30 సెంట్లు ఇలా మొత్తం ఎకరం 20 సెంట్లు సర్వే నం.237తోపాటు మరో సర్వే నంబర్‌లో బ ట్టల దుకాణాల కోసం ప్రభుత్వ భూమి కేటాయించా రు. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు అక్రమించుకుని భవనాలు ని ర్మించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధి కారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులే దగ్గరుండి వారికి సహకా రం అందించారనే విమర్శలు లేకపోలేదు. గతంలో శిఖం భూములకు అధికారులు అక్రమార్కులకు పట్టాలిచ్చారు. ఇరిగేషన్ అధికారులు రీ సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్‌ను వివరణ కోరగా చెరువులను కబ్జాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. కబ్జాలపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. రీ సర్వే చేసి భూములు కోల్పో యి, పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వే నిర్వహించాలి



గొల్లబాయ్ చెరువు మొత్తం కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో పరిహారం తీసుకున్న వారే మళ్లీ కబ్జాలు చేస్తున్నారు. రైతుల పంటల కోసం, చేపల పెంపకానికి నీళ్లు అందడం లేదు. అధికారులు స్పందించి సర్వే నిర్వహించాలి.

– గుమ్మల బాలయ్య, బెజ్జూర్

చిన్న వర్షానికే బురదమయం!



రుద్రాపూర్‌లో రహదారిపై నిలిచిన నీటిలో వెళ్తున్న గ్రామస్తులు



కోయపల్లి సమీపంలో వంతెన వద్ద బురదలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చింతలమానెపల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. అభివృద్ధి పనుల నిర్వహణలో లోపాలు ప్రజలకు మరిన్ని కష్టాలు తీసుకొస్తున్నాయి. మండలంలో రహదారులు, వంతెనలు నిర్మిస్తున్న అధికారులు నత్తనడకన పనులు చేపడుతుండడంతో వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. రుద్రాపూర్ గ్రామంలో డ్రెయినేజీలు లేక గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి కుంటలా మారింది. కోయపల్లి వద్ద నిర్మిస్తున్న వంతెన మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వంతెన వద్ద రహదారులపై వాహనాలు కూరుకుపోయాయి. ద్విచక్ర వాహనాలను బురదలో తోసుకుంటూ వాహనదారులు అష్టకష్టాలు పడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రజలు కోరుతున్నారు.

అంబలి పంపిణీ ఆదర్శనీయం



అంబలి తాగుతున్న తహసీల్దార్

రెబ్బెన: ఇందిరానగర్ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ అర్చకుడు దేవార వినోద్ చేపడుతున్న అంబలి పంపిణీ కార్యక్రమం అందరికీ ఆదర్శనీయమని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన కార్యక్రమం 33వ రోజుకు చేరుకుంది. శుక్రవారం అంబలి పంపిణీ వద్దకు వచ్చిన తహసీల్దార్ అంబలిని సేవించి సేదతీరారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు సేవ చేయాలన్నారు. ఎదుటి వారి కష్టం తన కష్టంగా భావించి సేవ చేసే మనస్సు అందరిలో కలగాలని అన్నారు. ప్రజల ఆకలిని గుర్తించి అంబలి పంపిణీ చేస్తున్న దేవార వినోద్‌ను అభినందించారు.

నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

దహెగాం: మండలంలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాలు నేర్పాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశలకు వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకున్న వారు స్వచ్ఛందంగా నిరక్షరాస్యులకు చదువు చెప్పడానికి ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరికి చదువు వచ్చేలా చూడాలన్నారు. కనీసం పేరు రాయడం, బస్సు బోర్డు చదవడం, ఊరు పేరు రాయడం, గుర్తించడం వచ్చేలా చూడాలన్నారు. జూన్ 6 నుంచి 12 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఎంపీడీవో అల్బర్ట్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు బాధ్యత నాది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



కొనుగోలు కేంద్రంలో జొన్నపంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: జొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వంతో మాట్లాడి రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేయించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను శుక్రవారం సందర్శించారు. అమ్మకాల కోసం తెచ్చిన జొన్నపంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట విక్రయానికి రైతులు ఐదారు రోజులు మార్కెట్‌లోనే వేచి చూడాల్సిన పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. వర్షంతో జొన్నలు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అక్రమంగా మహారాష్ట్ర నుంచి జొన్నలు తీసుకొచ్చిన వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే స్వయంగా రైతులకు భోజనం వడ్డించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, పెద్ద లక్ష్మణ్ యాదవ్, సామ రమేశ్ రెడ్డి, తిప్పిరెడ్డి రాకేశ్ రెడ్డి, సుభాశ్ యాదవ్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఇష్టారాజ్యం!

జైనథ్: మండలకేంద్రంలోని వైన్స్ వద్ద పర్మిట్ రూం లేకపోవడంతో మందుబాబులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. వైన్స్‌ను ఆనుకుని ఉండే రోడ్డుపైనే బైటాయించి దర్జాగా మందు తాగుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ వైన్స్ వద్ద పర్మిట్ రూం ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లోనూ వైన్స్‌ల వద్ద పర్మిట్ రూంలు ఉన్నాయి. జైనథ్ మండల కేంద్రంలోని వైన్స్ వద్ద మాత్రం నిర్వాహకులు పర్మిట్‌రూమ్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్కడ మద్యాన్ని కొనుగోలు చేసిన మందుబాబులు రోడ్లు, పంట చేలల్లో మందు తాగుతున్నారు. ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను అక్కడే వదిలేస్తుండటంతో పరిసరాలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధంగా మారుతున్నాయి. బయట ప్రాంతాల్లో మద్యం తాగే వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

సంచి కాదు సూచిక..!



సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారిపై స్థానిక గంగాయిగూడ కాలనీ సమీపంలోని కల్వర్టు వద్ద పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల పలు వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురికావడంతో స్థానిక గంగాయిగూడ కాలనీవాసులు గుంతలో ఓ కర్రకు సంచిని కట్టి ఉంచారు. ప్రమాదకర గుంతను వాహనాలు గుర్తించేందుకు ఈవిధంగా ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోదంతో అధ్వానంగా మారి తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – సిర్పూర్(టి)

అకాల వర్షం.. అపార నష్టం



తడిసిన వరిధాన్యాన్ని చూపుతున్న రైతు



పంట పొలాల్లో తడిసిన వరిధాన్యం

సిర్పూర్(టి): మండలంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరిధాన్యం పంట పొలాల్లో, కల్లాల్లో తడిసి ముద్దయ్యింది. గురు, శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షాలకు వరిధాన్యం తడవడంతో రైతులు తీవ్రంగ నష్టపోయారు. మండలంలోని సిర్పూర్(టి), టోంకిని, పారిగాం, లోనవెల్లి, కంచర్‌పేట్ తదితర గ్రామాల్లో రైతుల పంట నీటిపాలైంది. అకాల వర్షాలతో చేతికందిన పంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

చేతికందిన పంటలు వర్షార్పణం

రెబ్బెన: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు అకాల వర్షానికి తడిచి ముద్దవుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షానికి వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వేరు శనగ, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గోలేటి, కైరిగూడ పరిసర ప్రాంతాల్లోని రైతులు వేరుశనగ పీకి కాయలు తెంపేందుకు సిద్ధం చేస్తుండగా అకాల వర్షం రైతులను నిలువునా ముంచింది. వర్షానికి వేరుశనగ పూర్తిగా తడిచి కాయలు చెడిపోయాయి. చేతికి అందిన పంట కళ్ల ముందే పాడవుతుండటంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గోలేటి విలేజ్‌కు చెందిన అజ్మీర సురేష్ తనకున్న నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట వేయగా ఇటీవల వేరుశనగ కోసి కాయలు తెపేందుకు సిద్ధం చేశాడు. ఈ సమయంలో కురిసిన అకాల భారీ వర్షానికి పంట అంత చెడిపోయింది. కాయలు బూజు పట్టిపోవడంతో పంట కోసం పెట్టిన పెట్టుబడులు కూడ రాలేని పరిస్థితి. దెబ్బతిన్న పంటలపై సర్వే చేపట్టి ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటలు పరిశీలించిన అధికారులు

గోలేటి విలేజ్‌లో దెబ్బతిన్న వేరుశనగ పంటలను శుక్రవారం ఏవో దిలీప్ కుమార్‌తో పాటు ఏఈవోలు పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కష్టం.. నీటిపాలు..

కౌటాల: గత ఖరీఫ్‌లో సక్రమంగా వర్షాలు కురువకపోవడంతో ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రాక ఖరీఫ్ సీజన్ అన్నదాతను నిరుత్సాహపర్చింది. దీంతో జిల్లాలోని రైతులు ఎంతో ఆశతో యాసంగిలో వ్యవసాయ బావులు, వాగులు, బోరుబావుల ఆధారంగా వరి పంటను సాగు చేశారు. రబీలోనైనా పంటల నుంచి అధిక దిగుబడి వస్తే ఆదాయం సమకూరుతుందని రైతులు కష్టపడ్డారు. కానీ రైతుల కష్టం నీటి పాలైంది. నెలల పాటు కష్టపడి సాగు చేసిన పంట ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుండడంతో కేంద్రాల్లో తడిసిపోతోంది. కౌటాల మండలంలో రైతులు రబీలో 2 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. మండలంలో కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని శుక్రవారం రైతులు ఆరబోశారు. తడిసిన ధాన్యంతో పాటు వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు శుక్రవారం కదం తొక్కారు. జిల్లాలోని కౌటాల మండలం ముత్తంపేట వద్ద, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో, సిర్పూర్(టి) మండలం పారిగాం వద్ద ప్రధాన రహదారులపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



గుడ్లబోరిలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు



ముత్తంపేటలో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

భారీ వర్షం

కౌటాల: కౌటాల మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ సరఫరా తీగలపై పడడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని సాండ్‌గాం, వీరవెల్లి, కౌటాల, ముత్తంపేట, గుడ్లబోరి గ్రామాల్లో పంట నూర్పిడి చేసి ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం సైతం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్డీవోకు గ్రామస్తుల వినతి



వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని మండలంలోని ఇప్పల్ నవేగాం గ్రామస్తులు జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో లోకేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మీరు ఉంటున్న గ్రామం మా పట్టాలో ఉందని, మా భూమి మాకు కావాలని గ్రామాన్ని ఖాళీ చేసి వదిలి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 100 సంవత్సరాల నుంచి మేము మా గ్రామంలోనే ఉంటున్నామని, మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేశ్, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దహెగాం: ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

దహెగాం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఫర్టిలైజర్ దుకా ణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠి న చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణా లను తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఉండాలని పేర్కొన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. ఏవో రామక్రిష్ణ, ఎస్సై విక్రం, డీలర్లు ఉన్నారు.